# మేదర సొర్గం

ప్రేమ అనేది చిన్నప్పట్నుంచీ ప్రవర్ధమాన మౌతుంటూ తుదకు వివాహంగా పరిణమించేది భాగ్యవంతుల్లోకన్న బీదల్లోనే ఎక్కువ అని అనిపించక మానదు, విన్నవాళ్ళందరికీ, మేదరగూడెంలో చెప్పుకునే ఆవాళ్ల ప్రణయగాథనుబట్టి.

మేదరోళ్ళ పోతన్న చిన్నగుంటడిగా వున్నప్పుడేం జరిగిందిటా ?—నా దొంక గుడిసెలో అరుగుమీద కూర్చుని చూస్తూన్నాట్ట. ఎదూరుగుండా ఓ వెల్లడిస్థలం వుంది. ఆ స్థలంలో ఓ పాత పాడయిపోయిన బండీ వుంది. ఆ బండిమీదకెక్కి సుమారు ఓ ఇరవై మంది అంతపిల్లా ఇంతపిల్లా ఆడ మగ వివక్షతలేకుండా కూర్చుని ఆడుకుంటూవున్నారు. కొందరు కాడిమీద, కొందరు వెనుమొసాన్ని, కొందరు మధ్యను మొత్తం మీద అందరూ బండి తేలిపోకుండా జాగ్రత్తపడ్డారు. కాని వాళ్లల్లా ఆడుకుంటూంటే ఓ పెద్దవాడు గబుక్కున దూరాన్నుంచి "ఓరి ! మీ యిల్లు వల్లకాడుగాను. పడిపోతారు. ఆ బండి ఎక్కారూ ?" అని ఆంజనేయుల్లాగు గెంతి వాళ్ళను పట్టుకోబోయేడు. ఆపాళంగా బండిమీదున్న పిల్లలందరికీ జడుపెత్తింది. అందరూకూడా కొందరు బిక్కమొగాల్తో, కొందరు వెక్కువెక్కు ఏడుపుల్తో, కొందరు బెదురుచూపుల్తో ఇలాగ్గా పరుగుచ్చుకున్నారు.

ఆ భయపెట్టే మనిషి, అమాంతంగా వాళ్ళల్లో ఓ చిన్న గుంటని రెండుచేతులా ఎత్తిపట్టేడు. దూరాన్నుంచి పోతన్న

చూస్తూవున్నాడు. చూస్తూవున్న పోతన్న నింకా చూడనన్నట్టు గుడిసెలో లోతట్టునుండి వెదుళ్ళపేళ్ళు చీల్చుకుంటూవున్న ఓ ముసల్ది "ఒరేవు! పోతన్నోయి! నీ పెళ్లాన్ని వాడెత్తుకు పోతున్నాడురో" అంది. పోతన్నకు పట్టరాని దుఃఖం వచ్చే సింది. నిజంగా ఎంచితే పోతన్నకూ ఆ గుంటకూ పెళ్ళీకాలేదు ఏమీకాలేదు. అసలు వాళ్ళిద్దరికీ పెళ్ళి అవుతుందో లేదో. ఊరికే వాగికంది ముసల్ది.

ముసిలిదాని మాట విన్నాడుక మోసు అంజనేయులు మనిషి- ఆవెంటనే తానెత్తుకున్న పిల్లని తీసుకొచ్చి పోతన్న నెత్తిమీద కూర్చోపెట్టి "నీపెర్రం నాకెందుకురా? నీపెర్రం నాకెందుకురా?" అని వాడి నెత్తిమీద కూర్చోపెట్టినట్టు కూర్చోపెట్టి కిందకు జార్చి తాను మాయమైపోయాడు. బిక్కమొగాల్తోనూ, ఏడుపు మొగాల్తోనూ వున్న పిల్లకాయలంతా వెనక్కు చూస్తూ ఆ అంజనేయులు మనిషి చేష్టకు పకపకా పకపకా నవ్వేనారు. వాళ్ళన్నమాటేమిటి? గూడెం యావన్మందీ ఆ వినోదంలో పాల్గొన్నారు.

పోతన్న అన్న పైగుంటడు తన నెత్తెక్కి దిగిన గుంటను చూచేడు. ఆ గుంట తల్లి దూరాన్నుంచి "ఒలేవు! నీ యిల్లు మాసిపోను. అది నెత్తెక్కి కూకునేకన్న ఇక్కడ కూకుని యీ పేళ్ళు మణిసిపెడితేం? జణాడబ్బులొస్తయికాదే బుట్టకి?" అని కూకేసింది. గుంట పారిపోయింది. గుంట వెనకాతలే పోతన్న చూపులు చెమ్మగిల్లాయి

గుంటకు ఎనిమిదేళ్లుంటాయి. పోతన్నకు-మరేమన్నా- పంద్రెండేళ్లుంటాయి.

అపొద్దు మొదలూ పోతన్న తన ప్రణయగాథకు పునాది వేయడం. గుంటపేరెవరా అని ఆలోచించేవాడు. దాన్ని పిలిచేవారి

నోపెంట. పిల్లతండ్రి ఎవరా అని తిలకించేవాడు దాన్ని బజారుకు తీసుకెళ్ళే మగాడొంక. పిల్ల నవ్వాలికిస్తూంటే ఇక పోతన్న రూపం తబ్బిబ్బైపోయీది! గబగబా వెళ్ళి "ఓలేవు, కన్నమ్మా!" అని కావులించుకు ఎత్తికుదేసేవాడు. ఒళ్ళంతా నలిపేసేవాడు.

కన్నమ్మకు తొమ్మిదేళ్లొచ్చాయి. పోతన్నకు మరేమన్నా పదమూడేళ్లొచ్చాయి.

పెబద్ద ఏడాదిలో వూసేంటంటే — ఆ మేదరగూడెంలో వాళ్ళిద్దరికీ మహాజత అని అనుకునేవారు పిల్లలంతా. పెద్ద వాళ్లున్నూ అనుకునేవారు. "ఇఖ వాళ్ళిద్దరికీ పెళ్ళి తప్పవిసరిగా చెస్తేనే యీ ప్రపంచంలో ఈడూ జోడూ అనే పదానికి సార్థకం" అని.

గుంటకి పదేళ్లొచ్చాయి. గుంటడికి మతేమన్నా పధ్నాలు గేళ్లు వచ్చాయి.

ఈ యేడాదిలో వూసేంటంటే—పోతన్నకూ, కన్నమ్మకూ పెళ్ళయిందని అష్టాదశ వర్ణాల్లోను పట్నమంతా మోగిపోయింది. కన్నమ్మమెళ్లో పుస్తెమెరుపు. పోతన్న కళ్ళల్లో నిదానంగా నీడట్టుకు నిల్చిపోయీది.

పోతన్నకో ఇరవైయేళ్ళొచ్చాయి. కన్నమ్మకో పదారేళ్ళొచ్చాయి. కన్నమ్మ అత్తింటికొచ్చి పోతన్నతో సరాసరి కూచుని పేడుతియ్యడం, అంచుకొయ్యడం, వెదుళ్ళ మొయ్యడం వడపదుయ్యడం, ఇలాంటి కులవృత్తి పనుల్లో మసిలీది.

మనువుచనువుకొద్ది ఓరోజుని మరీ దగ్గరసా ఆరుబయట కూర్చున్నారు పోతన్నా కన్నమ్మా యిద్దఱూను. కన్నమ్మ ఓ చూపు తడికెను పురికొస పోస్తూవుంది. పోతన్న ఓ విసనకర్ర అల్లుతూవున్నాడు.

ఆ సమయంలో వాళ్ళచుట్టూవున్న జగత్తు ఎలావుందో ముందుగా ఆకలించి. తరువాతను వాళ్ళ ఆంతరంగిక ప్రవృత్తి యోజిస్తే ఎటువంటివానికైనా బోధపడుతుంది; ఈ జగత్తు మిధ్య అనీ, మిధ్యేకాదు అసలే లేదనీ, అక్కడున్నదల్లా పోతన్నా కన్నమ్మా ఇద్దఱే అనీ బోధ పడుతుంది.

నిజంగా చుట్టూవున్న పెంటపోగుల ధూళి, కసాయి దుకాణం మీదుగా ఎగిరివచ్చే గద్దయీఁల, గుడారోళ్ళ కుక్క మొఱుగు, గుడిసెల యిరుకు, ఇవేమిన్నీ వాళ్ళ మనసుల్లో మననం గొల్పడంలేదు. వాళ్ళ మనస్సుల్లో పనిచేస్తూవున్న దొకానొక ప్రేమ తరంగము! చిన్ననాటి వాళ్ళయొక్క యొకానొక కల!—ఆ కల వెలుగునే మెలకువగానే వాళ్ళదైన యొకానొక నిదురజోగు.

కన్నమ్మ అంది పోతన్నతో—"ఈయేళ నీ విసనకఱ్ఱ ఎవరిచేతుల్లోపడి మెరిసిపోతుందో?" అని. పోతన్న "మహారాజులుంగారు పురమాయించేరే ఇది. ఆయనే విసరుకుంటారుట దీంతో" అన్నాడు. కన్నమ్మ వెంటనే అంది "అబ్బో! అబ్బో! ఆ కూంత విసివికఱ్ఱకే నీవంత కులుకు కులికిపోతే నేనెంత కులికేదిరా యీ చూపుతడిక్క! ఇది మహారాణీగారు పురమాయించేరు. ఆవిడ దీని వెనకాతలుండి నాట్యమాడుతారంట" అంది.

సంతోషాశ్రువులు ఇద్దరికీ వెల్లివిరిసిపోయినాయి పైసల్లా పంతో. ఇద్దరూ వారివారిచేతల్ని అమ్మజూపడానికి ప్రయాణమయినారు.

ఆరోజు చాలా ఉక్కగావుంది. అంజనీ ప్రియుడు మరో తూరి ఏడుఘడియలు ఉగ్గబట్టడం ఆ రోజునే అన్నట్లు మిక్కిలి ముక్కిపోతూవుంది జగత్తు అంతా.

మహారాజావారు మహారాణీగారూ ఇద్దరూ కోటగోడల మధ్యన వుండి అనుకుంటూవున్నారు.

మహారాజావారు "ఇంకా పురమాయించిన విసనకర్ర రాలేదేమిరా?" అని. మహారాణీగారు "ఈ గోడ తీసివేసి యిక్కడో చూపుతడికె కట్టించినా బాగుండీది. రవ్వంత యూపి రాదేదేమో?" అని.

ఎంతకూ మేదరవాళ్లెవళ్లూ విసనకర్రగాని, చూపుతడికె గాని తీసుకువచ్చిన జాడ కనపడలేదు. అందుమీద సేవకుల్ని పిలిచి, మహారాజావారు వెళ్ళి కనుక్కోని ఆ మేదరవాళ్ళను రెక్కలు విరిచికట్టి తీసుకురమ్మన్నారు.

సేవకులు కోటలోంచి వీధిలోకొచ్చి మేదరవాళ్లు వస్తున్నారేమోనని చూచేరు. మేదరపోతన్న, తా నానాడు మహారాజులుంగారికోసం అల్లి మహారాజులుంగారికోసం తీసుకువస్తూవున్న విసనకర్ర చేతపుచ్చుకుని తానే విసురుకుంటూ వీధంట నడుస్తూ, కోటకూడా దాటి అవతలవీధి కెక్కడకో పోతూవున్నాడు.

అందుమీద సేవకులు మేదరపోతన్నను కూకేశారు. కాని పోతన్న వెనక్కు తిరిగి చూడ్డాయె. వాని నడకే పరుగులాగుంది. చేతిలోవి విసనకర్రతో తన వొళ్ళు విసురుకుంటూ పోతూ వున్నాడు. వెనకచూపు లేనేలేదు వాని కళ్ళల్లో. పోతన్న పెళ్లాం కన్నమ్మ అయినట్టాయినా చూపుతడిక నెత్తి నెట్టుకుని ఒకచేనడక ఒకచేనడక ఊగావాలి దిజ్మండలంకేసి. తన నీడనుమాత్రం తనతోకూడా రమ్మన్నట్టు సంజ్ఞామాత్రంగా మునివ్రేళ్ళ పూమట్టెల్ని నవ్వేడి గావిస్తూంది.

సేవకులు వెళ్ళి ఆ రెండు వింతలూ రెండు మహాసమస్యల్లాగు రాజదంపతులకు విన్నవించారు. రాజదంపతులు

ఆ మేదరవాళ్ళ వెఱ్ఱి యెట్టిదో గ్రహించుదామని. మేడదిగి. కోట వెలువడి, తోటవిడిచి, పేడలోపడి, ఊరావలకు జేరుకున్నారు. రాజదంపతుల్తో అమాత్యాదులు. అమాత్యాదుల్తో ప్రజలు, ప్రజల్తో పశువులు, యావన్మందీ ఆ యుక్కపోతలో, ఎవళ్ళయూర్పులగాలితోనే వాళ్ల వళ్లు ఆర్పుకుంటూ నడవసాగేరు.

చివరకు వింటే ఆ మేదరదంపతుల నోటినుంచి తేలిన రహస్యం యిది—

కన్నమ్మ—"పోతన్నా! నీ విసనకఱ్ఱ మహారాజులుంగారికివ్వక నివ్వేసురుకుంటూ వున్నావేమిరా? బాగుంటుందిరా? ఆ సంగతి చూస్తే మహారాజులుంగా రుచ్చుకుంటార్రా?" అంది.

పోతన—"ఓసి! ఈరోజున ఒక్క శరీరానికి చెమట పోయడమేకాదే, హృదయానిక్కూడా పోస్తూ వున్నట్టుంది. చూడు! అలాంటప్పుడు నే ముందు విసురుకోకుండా యింకోళ్ళకీవిసనకఱ్ఱ ఎలా ఇవ్వగలను చెప్పు?" అన్నాడు.

"అదే నే నాలోచిస్తూవున్నదీని. ఈరోజున ఉక్కపోత నాలుగ్గోడలమధ్యనీ వున్నట్టుగాలేదురా పోతన్నా! దిజ్మండలాన్నికూడా తీసిపారేసి. ఆ దిగ్భిత్తికి బదులుగా ఈ చూపుతడికె కడితే ఎలావుంటుందో అని ఆలోచిస్తూ పోతూవున్నాను" అంది కన్నమ్మ.

"అప్పుడు నీ చూపుతడికెలోంచి స్వర్గం కనిపిస్తుంది" అన్నాడు పోతన్న.

విన్నవాళ్ళంతా తాం భూమ్మీద పడుతూవున్న ఉక్కబాధ మఱచిపోయి వాళ్ళను వెఱ్ఱిగా చూడదొడగేరు. మహారాజులుంగారూ, మహారాణీగారూ కూడాను.